RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 242 | పేజీలు : 08 | శుక్రవారం | 11-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



## సోదరుడికి కట్టబెట్టాడు

- రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్
- రేవంత్ రెడ్డి తన 18 గంటల సమయాన్ని ఆయన సోదరుల కోసం కేటాయిస్తున్నారన్న కేటీఆర్ 2
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ. 200 కోట్ల భూమిని కట్టబెట్టారని ఆరోపణ
- ఈ భూ కుంభకోణంపై ఈడీ, సీబీఐలతో కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్

హైదరాబాద్ పల్స్,డెస్క్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### పంచాయతీరాజ్ చట్టం

2018 సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం 2



## ఇక మొబైల్ లో కూడా దరఖాస్తు



- ఇందిరమ్మ ఇంటి కోసం అప్లై చేసుకోవాలా?
- సులభంగా మీ మొబైల్‌తోనే దరఖాస్తు చేసుకోండి
- ఇందిరమ్మ ఇంటి కోసం ఎలా అప్లై చేసుకోవాలో తెలియట్లేదా?
- అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయారా?
- సులభంగా సోషల్ మీడియాలో అప్లికేషన్ పూర్తి
- ఇలా చేస్తే ఎవరికీ డబ్బు చెల్లించాల్సిన పనిలేదు

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించిన సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వ యంత్రాంగం సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగిస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే సాంకేతిక పునాదిపై ఈ ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని రూపొందించేందుకు సమష్టి కృషి జరుగుతోంది. సోషల్ మీడియా ద్వారా సమాచారాన్ని పంచుకోవడం వల్ల, ప్రజలు మధ్యవర్తులపై ఆధారపడకుండా సొంతంగా దరఖాస్తు చేసుకునే వీలు కలుగుతోంది. మొబైల్ ఫోన్ నుండే దరఖాస్తు ప్రక్రియను పూర్తి సదుపాయం కల్పించడమే కాకుండా, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఫోన్ సహాయం కూడా అందుబాటులో ఉంది.

ఇలా సులభంగా దరఖాస్తు చేసుకోండి

గతంలో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే కుటుంబ వివరాలన్నింటితో కూడిన, తహసీల్దార్ ధ్రువీకరించిన పత్రాలను సమర్పించాల్సి వచ్చేది. ఈ పత్రాలను పొందడానికి పంచాయతీ, మండల



## బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

- తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు
- ఇతర పార్టీల వారికి కూడా మంచి చేసే నాయకుడు తుమ్మల అన్న పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి
- తుమ్మల అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని ప్రశంస 2
- ఏ సమస్యపై ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తారని కితాబు

### కేటీఆర్,హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

- మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు
- కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్ 2
- అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు
- భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు

## మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్

22ఏ భూములపై చర్చకు డిమాండ్..

- చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు
- 22ఏ భూములపై చర్చకు అనుమతించపోవడంతో వాకౌట్ చేసిన సభ్యులు
- మార్షల్స్ వ్యవహరించిన తీరుపై మధుసూదనాచారి మండిపాటు



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే

## కేసీఆర్ ఫాంహౌస్ మైలపడిందా?

- ఫాంహౌస్ నుంచే దళితులపై దాడులకు ప్రణాళికలు రచిస్తున్నారు: అద్దంకి దయాకర్
- కాంగ్రెస్ శ్రేణులు దప్పు కొడితే కేసీఆర్ ఫాంహౌస్ మైలపడిందా? అని దయాకర్ మండిపాటు
- శుద్ధి చేయడం ఎంతవరకు సబబు? అని ప్రశ్న
- రేవంత్ రెడ్డిపై ఉన్న కడుపుమంటతో అసెంబ్లీని అభాసుపాలు చేస్తున్నారని విమర్శ



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

అసెంబ్లీ సమావేశాల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య పోరు తీవ్రరూపం

## సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం

- రేవంత్ రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం: హరీశ్‌రావు
- కాంగ్రెస్ పార్టీ ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా దాడి చేస్తోందన్న హరీశ్
- ఫేక్ అకౌంట్లలోని పోస్టులను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారని మండిపాటు
- సభకు, ప్రజలకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్



### 90 ఎంఎల్ వేసుకుని ఆ ఫేక్ అకౌంట్ సృష్టించారా?

- 90 ఎంఎల్ వేసుకుని ఆ ఫేక్ అకౌంట్ సృష్టించారా? 2
- రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్
- 'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని కాంగ్రెస్ సృష్టించిందన్న ప్రవీణ్ కుమార్
- ఈ డ్రామా వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపణ
- ఏ పార్టీకి అంతర్జాతీయ కార్యదర్శి అనే పదవి ఉండదని వ్యాఖ్య

## దుష్ప్రచారాలు నమ్మొద్దు

- గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్ 2
- గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ఎ హైడ్రా వ్యతిరేకం కాదన్న రంగనాథ్
- సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి
- అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టీకరణ



హైదరాబాద్ పల్స్,డెస్క్

హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై

## ఒక్క సైగతో రాజకీయ దుమారం..

- విజయ్ ఒక్క సైగతో రాజకీయ దుమారం..
- స్టాలిన్‌ను బాధించిన 1976 నాటి ఆ గాయం ఏంటి? 2
- సీఎం విజయ్ 'దవడ సైగ'తో రాజకీయ దుమారం
- కావాలని చేయలేదని సీఎం వివరణ
- తీవ్రంగా తప్పుబట్టటిన డీఎంకే వర్గాలు
- ఎమర్జెన్సీ సమయంలో తన దవడ ఎముకలు విరిగింది నిజమేనన్న స్టాలిన్
- సీఎం స్థాయి ఏంటో తెలుసుకొని వ్యవహరించాలని హితవు



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఒక చిన్న సైగ .. తమిళనాడు రాజకీయాల్లో పెద్ద దుమారమే రేపింది. అసెంబ్లీలో సీఎం విజయ్ తన దవడను చేతితో పట్టుకున్న తీరు ఇప్పుడు తీవ్ర రాజకీయ వివాదానికి కారణమైంది. అది డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను ఉద్దేశించి చేసిన ఎద్దేవా

## సోదరుడికి కట్టబెట్టాడు

మొదటి పేజీ రువాయి

ధ్వజమెత్తారు. ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని ఈరోజు ఆయన సందర్శించిన పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు.కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు.నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం

మొదటి పేజీ రువాయి

నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు.తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

## పంచాయతీరాజ్ చట్టం
### 2018 సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

మొదటి పేజీ రువాయి

పంచాయతీరాజ్ చట్టం 2018 సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఇవాళ సభలో చర్చ అనంతరం సవరణ బిల్లుకు సభ్యులు ఆమోదం తెలిపారు. బిల్లును బుధవారం మంత్రి సీతక్క సభలో ప్రవేశపెట్టారు. కొత్త సవరణ ప్రకారం గ్రామ పంచాయతీలు సొంత ఆదాయాన్ని సమీపంలోని నేషనల్ బ్యాంకులో జమ చేసుకునేలా చట్ట సవరణ చేశారు. ప్రస్తుతం గ్రామపంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీలో జమ చేస్తున్నారు.

స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయి

పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్న మంత్రి సీతక్క ఎన్నికల తర్వాత పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదల అవుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని, స్టాంపుడ్యూటీని 2018లోనే తొలగించటం స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయని చెప్పారు.

గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నాం

గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామన్న మంత్రి సర్పంచ్‌లకు పెండింగ్ ఉన్న నిధుల్లో పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ పనులు చేసి పంచాయతీరాజ్‌శాఖను అడుగుతున్నారని తెలిపారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని సభకు వివరించారు.

## బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

మొదటి పేజీ రువాయి

కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు.ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

## కేసీఆర్ ఫాంహౌస్ మైలపడిందా?

మొదటి పేజీ రువాయి

దాల్చింది. బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ కక్షపూరిత కుట్రలు చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు."కాంగ్రెస్ శ్రేణులు డప్పులు కొడితే ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ ఏమైనా మైలపడిందా? దాన్ని శుద్ధి చేయడం ఎంతవరకు సమంజసం?" అని బీఆర్ఎస్ నాయకులను ఆయన సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలకు ప్రజాసమస్యలు పట్టవని, కేవలం రేవంత్ రెడ్డిపై ఉన్న కడుపుమంటతోనే అసెంబ్లీని అభాసుపాలు చేస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి తీవ్ర పదజాలంతో దూషించడాన్ని ఖండిస్తూ ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిర్వహించిన 'చావు డప్పు' నిరసనపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని దయాకర్ విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చట్టసభలు, ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని, ఫాంహౌస్ నుంచే దళితులపై దాడులకు, ప్రభుత్వంపై కుట్రలకు ప్రణాళికలు రచిస్తున్నారని ఆరోపించారు. వారే తప్పులు చేసి, పైగా ప్రభుత్వంపై నిందలు వేయడం బీఆర్ఎస్‌కే చెల్లిందని, వారి నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

## మీ మొబైల్ తోనే దరఖాస్తు

మొదటి పేజీ రువాయి

కార్యాలయాలు, మీ సేవ కేంద్రాలు, కారోబార్ (గ్రామ సహాయకుడు), పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్ వంటి అధికారుల చుట్టూ పదేపదే తిరగాల్సి ఉండేది. దీనికోసం తరచుగా రాజకీయ నాయకుల సహాయం కోరాల్సి వచ్చేది. హైదరాబాద్ వంటి నగరాల్లోని చాలా మంది నివాసితులకు తమ ప్రాంతం ఏ మండలం పరిధిలోకి వస్తుందో తెలియకపోవడంతో, వివిధ కార్యాలయాల చుట్టూ తిరగడానికి రెండు, మూడు రోజులు పని మానుకోవాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను అధిగమించడానికి, అధికారులు మొబైల్ ఫోన్ల ద్వారానే ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టారు. స్మార్ట్‌ఫోన్‌లు లేని అర్హులైన వారి కోసం మీ సేవ కేంద్రాలు, కలెక్టరేట్ల వద్ద ప్రత్యేక సహాయ కేంద్రాలను అంటే హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

ఎవరికీ డబ్బు చెల్లించాల్సిన అవసరం లేకుండా :

డబ్బు ఆశ చూపించి, ఇళ్లు ఇప్పిస్తామని చెప్పే వారిని నమ్మవద్దని, ఎవరికీ ఎలాంటి డబ్బు చెల్లించవద్దని ప్రజలకు సూచిస్తూ అధికారులు tghd.official ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ప్రచారం చేస్తున్నారు.

80969 58096 నంబర్‌కు వాట్సాప్ ద్వారా కూడా దరఖాస్తులను సమర్పించవచ్చని వారు ప్రకటించారు.

meeseva.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తులు సమర్పించవచ్చు.

ఇంటి మొత్తం విస్తీర్ణం, కార్పెట్ ఏరియాకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేయడానికి టోల్-ఫ్రీ నంబర్ 1800 599 5991 అందుబాటులో ఉంది. సాధారణ విచారణల కోసం 040-24603572 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## కేటీఆర్,హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

మొదటి పేజీ రువాయి

తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## బీఆర్ఎస్ వాకౌట్

మొదటి పేజీ రువాయి

రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు.వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

## 90 ఎంఎల్ వేసుకుని ఆ ఫేక్ అకౌంట్ సృష్టించారా?

మొదటి పేజీ రువాయి

శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'సంధ్యా రావు' అనే ఎక్స్ ఐడీ చేసిన ట్వీట్ ను ప్రదర్శించడంపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలో ఒక నకిలీ ఖాతా ఆధారంగా సీఎం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, అసలు ఏ రాజకీయ పార్టీకైనా 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవి ఉంటుందా అని ఆయన ఎద్దేవా చేశారు.ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీకి కూడా అంతర్జాతీయ కార్యదర్శి అనే పదవి ఉండదని... సీపీఐ, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ ఏ పార్టీ చూసుకున్నా ఇలాంటి హోదా ఉండదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. అలాంటిది 'సంధ్యా రావు' అనే పేరుతో బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి అని రేవంత్ రెడ్డే కొత్త పదవిని సృష్టించారని దుయ్యబట్టారు.ఫేక్ ఐడీ పోస్టులను సృష్టించేటప్పుడు కాంగ్రెస్ నేతలు లేదా సీఎం ఏమైనా '90ఎంఎల్' వేసుకుని ఉన్నారా? అని ఘాటుగా ప్రశ్నించారు. ఈ డ్రామా వెనుక ఉన్న అసలు సూత్రధారి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. కాంగ్రెస్ ఐటీ సెల్ ద్వారానే 'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని సృష్టించి, దాంతో తప్పుడు పోస్టులు పెట్టించి, ఆపై అదే అంశంపై రేవంత్ రెడ్డే స్వయంగా సిట్ విచారణకు ఆదేశించడం విచిత్రంగా ఉందని ధ్వజమెత్తారు.

## దుష్ప్రచారాలు నమ్మొద్దు

మొదటి పేజీ రువాయి

సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు.నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# ఆలేరు నియోజకవర్గంలో అధిక బస్సులు పునరుద్ధరణ చేయాలి

**గ్రామాలు, తండాలకు అవసరమైన మేరకు అదనపు బస్సులు కేటాయించాలి**

**యాదగిరిగుట్ట బస్ స్టాప్ పరిసర ప్రాంతాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**

**శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేయాలి**

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : హైదరాబాద్ అసెంబ్లీ, తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు పెద్దపీట వేసి, వారి ఆత్మగౌరవాన్ని పెంచేలా నిర్ణయాలు తీసుకోవడంతో మహిళల్లో సంతోషం వ్యక్తమవుతోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం అసెంబ్లీలో బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ఆలేరు నియోజకవర్గానికి, యాదగిరిగుట్ట ఆలయానికి సంబంధించిన పలు రవాణా సమస్యలను ఆయన ప్రస్తావించారు. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని తెలిపారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని యాదగిరిగుట్ట బస్ స్టాప్ పరిసర ప్రాంతాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో అనుకోని ఘటనలను అరికట్టడంతో పాటు భక్తుల భద్రతను మరింత పటిష్ఠం చేయవచ్చని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పలు గ్రామాలు, తండాలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయా గ్రామాలు, తండాలకు అవసరమైన మేరకు అదనపు బస్సులు కేటాయించాలని కోరారు. యాదగిరిగుట్ట ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నందున ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. అలాగే యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన వంగపల్లి నుంచి గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు బస్సు సౌకర్యం సరిగా అందుబాటులో లేకపోయిందని తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సహకారంతో వంగపల్లిలో శాశ్వత బస్ స్టాప్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. అయితే కొన్ని డిపోల బస్సులు వంగపల్లి వద్ద ఆగడం లేదని, అందువల్ల ప్రయాణికుల సౌకర్యార్థం అక్కడ టికెట్ పాయింట్ ఏర్పాటు చేసి, అన్ని సంబంధిత బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే యాదగిరిగుట్ట ఆలయానికి, యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోకు నూతన బస్సులు కేటాయించాలని బీర్ల ఐలయ్య మంత్రిని కోరారు.



**మంత్రి సానుకూల స్పందన**

బీర్ల ఐలయ్య ప్రస్తావించిన అంశాలపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి, యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోకు అవసరమైన బస్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వంగపల్లి వద్ద వరంగల్ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే విధంగా టికెట్ పాయింట్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

# బెంగాల్‌లో మానవత్వాన్ని మంటగలిపిన హత్య!

**అదృశ్యమైన సుజిత్ మండల్ మృతదేహం ముక్కలుగా లభ్యం.. ముగ్గురు అనుమానితుల అరెస్ట్.**

**పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు.. సంచలన కేసు దర్యాప్తు సీఐడీకి.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్ ప్రత్యేక కథనం, ముర్షిదాబాద్, సెప్టెంబర్ 10:**

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా ధులియాన్ ప్రాంతంలో సుజిత్ మండల్ (36) హత్య కేసు తీవ్ర కలకలం రేపింది. ఆగస్టు 28న అదృశ్యమైన సుజిత్ మృతదేహానికి సంబంధించిన భాగాలు ఫరక్కా ప్రాంతంలో లభించడంతో కేసు సంచలనంగా మారింది. ఘటనపై రాష్ట్ర నేర పరిశోధన విభాగం దర్యాప్తు చేపట్టింది.

**ఆగస్టు 28న అదృశ్యం**

ధులియాన్ ప్రాంతానికి చెందిన సుజిత్ మండల్ ఆగస్టు 28న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనంతరం తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కుటుంబానికి డబ్బులు డిమాండ్ చేస్తూ ఫోన్ కాల్ వచ్చినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి.

**మృతదేహం భాగాలు లభ్యం**

సుజిత్ కోసం పోలీసులు గాలింపు చేపట్టగా ఫరక్కా




ప్రాంతంలో మృతదేహానికి సంబంధించిన భాగాలు లభించినట్లు అధికారులు తెలిపారు. వాటిని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. ప్రాథమిక దర్యాప్తులో ఆర్థిక వివాదం కోణం కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అయితే హత్యకు ఖచ్చితమైన కారణం ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు.

ముగ్గురు అనుమానితుల అరెస్ట్

కేసులో ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిలో సామియుల్ షేక్, జానీ షేక్, తాజ్‌కిరా బీబీ ఉన్నట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. హత్యతో పాటు మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులపై న్యాయస్థానం తుది తీర్పు వెలువరించే వరకు వారిని దోషులుగా పేర్కొనడం సరికాదు.

**పోలీసుల తీరుపై ప్రశ్నలు**

సుజిత్ అదృశ్యమైన సమయంలో స్థానిక పోలీసులు వ్యవహరించిన తీరుపైనా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కొంతమంది పోలీసు అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇద్దరు పోలీసు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరిపై పరిపాలనా చర్యలు చేపట్టినట్లు నివేదికలు వెల్లడించాయి.

**సీఐడీకి దర్యాప్తు బాధ్యత**

కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దర్యాప్తును సీఐడీకి అప్పగించింది. ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, అరెస్టైన అనుమానితుల పాత్ర, ఫోన్ కాల్స్, మృతదేహం భాగాలు లభించిన ప్రాంతం తదితర అంశాలను సీఐడీ అధికారులు పరిశీలిస్తున్నారు.

**రాజకీయ కోణంపైనా చర్చ**

సుజిత్ మండల్ బీజేపీ కార్యకర్తగా ఉన్నట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్న నేపథ్యంలో కేసుకు రాజకీయ రంగు కూడా వచ్చింది. అయితే హత్యకు రాజకీయ కారణమే ప్రధాన కారణమని నిర్ధారించే అధికారిక ఆధారం ప్రస్తుతం వెలువడలేదు. ఆర్థిక వివాదం సహా అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. సీఐడీ దర్యాప్తు పూర్తయిన తర్వాతే హత్య వెనుక అసలు కారణం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## మీర్ ఉస్మాన్ అలీఖాన్, ఖాసిం రజ్వీ

# అగాడాలను అడ్డుకున్న వీరవనిత చాకలి ఐలమ్మ

**సామాన్య మహిళ అసమాన ధైర్యసాహసాలు, వీరత్వాన్ని ప్రదర్శించిన వీరనారి ఐలమ్మ**

**తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రత్యక్షంగా పోరాడి, నైజాం మూకలకు వ్యతిరేకంగా పోరాడి అమరత్వం పొందిన కామ్రేడ్**

**చిట్యాల (చాకలి) ఐలమ్మ కు విప్లవ జోహార్లు**

**సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా** ప్రతినిధి : దున్నేవారికే భూమి దక్కాలని, వెట్టిచాకిరీ పోవాలని, అసమానతలు నశించాలని, దోపిడీ, పీడనలు అంతరించాలని, అవమానాలు, అందకారాలు, హింస, దాడులు, హత్యలు, అత్యాచారాలు నిర్మూలించబడాలని నాటి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నైజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్, వాడి అంగరక్షకుడు, గూండా



అయినట్టి ఖాసిం రజ్వీ అగాడాలకు, భూస్వాములు, వారి గూండాల దాడులకు ఎదురు నిలిచి వీరోచితంగా సాగిన నాటి సాయుధ రైతాంగ పోరాటంలో ప్రత్యక్షంగా పోరాడి వీరమరణం పొందిన కామ్రేడ్ చిట్యాల (చాకలి) ఐలమ్మ ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, త్యాగాలు, ఎంచుకున్న పోరాట పంథా నేటికీ, ఎన్నటికీ మార్గదర్శకమేనని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. సెప్టెంబర్ 10 కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి సందర్భంగా ఆలేరు హైస్కూల్ ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. జోహార్ వీరనారి ఐలమ్మ, అమరవీరులకు విప్లవ జోహార్లు, సాధిస్తాం అమరవీరుల ఆశయాలను, వర్ధిల్లాలి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట పంథా, వర్ధిల్లాలి సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ తదితర నినాదాలతో కామ్రేడ్ ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకెఎంఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్లెపు అడివయ్య, బేజాడి కుమార్, ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, ఏఐకెఎమ్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల బాల మల్లేష్, చిరబోయిన కొమురయ్య, ప్రజాసంఘాల నాయకులు ఇక్కిరి శ్రీనివాస్, చిన్ని అబ్బ సాయిలు, కుర్రి మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథపురంలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి, ధైర్యసాహసాలకు ప్రతీక అయిన చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా రఘునాథపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, వార్డు సభ్యులు, రజక సంఘం నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ పేదలు, రైతులు మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ఆమె ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు కానుగంటి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండం రాజు, బొద్దుల వెంకటేష్, వార్డు సభ్యులు తుంగ అక్షయ్ కుమార్, వడ్లకొండ మందు, ఉచ్చేంతల రాధాస్వామి, బత్తిని బలరాములు, పత్తిని పరమేశు, మిట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే రజక సంఘం నాయకులు వడ్లకొండ నారాయణ, వడ్లకొండ రమేష్, వడ్లకొండ కృష్ణ, బాలస్వామి, కలకుంట్ల సంపత్, మిరియాల ప్రశాంత్, గొర్రెంకల సాయి, రాచమల్ల మల్లికార్జున్ తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు






## గురుజువాడ నుంచి డాక్టరేట్ దాకా..!

### 'రుద్రమదేవి'పై పరిశోధనకు తెలుగు ఉపాధ్యాయుడు విఠల్‌కు పీహెచ్‌డీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, కోహీర్, సెప్టెంబర్ 10:**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గురుజువాడ గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు సి.హెచ్. విఠల్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. తెలుగు సాహిత్యంలో 'రుద్రమదేవి' అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గుర్తింపుగా ఈ డాక్టరేట్ లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో విఠల్‌కు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా ముఖ్య అతిథిగా హాజరై ఆయనకు పట్టాను అందజేశారు. రాష్ట్ర గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ కులపతి శివ ప్రతాప్ శుక్లా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన విఠల్ నిరంతర కృషి, పట్టుదలతో ఉన్నత విద్యలో ముందుకు సాగి డాక్టరేట్ సాధించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. ఆయన విద్యా ప్రస్థానం గ్రామీణ ప్రాంత యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. డాక్టరేట్ సాధించిన సందర్భంగా విఠల్‌ను ఆయన గురువులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు.



## శ్రీ బాపూజీ రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో శ్రీ బాపూజీ రజక సహకార సంఘం వారి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరానారి చాకలి ఐలమ్మ పెత్తందారి వ్యవస్తాను విసునూరు దేశముఖ్ దోరల అణచివేతకు వ్యతిరేకంగా తన భూమిని హక్కులను కాపాడు కోవడం కోసం ఆమె చేసిన పారాటం తెలంగాణ సొంతంగా పోరాటంలో చరిత్ర చరిత్రత్మకమైనది ఈ భూమి నాది పండించిన పంటనాది తీసుకు వెళ్ళడానికి దొర ఎవ్వడు నా ప్రాణం పోయాకనే ఈ పంటను భూమిని మీరు దక్కించు కోగలరు అంటు తన మాటల్ని తుటాలుగా మల్చుకొని దోరల గుండెల్లో బడా బగ్నిలా రగిలిన తెలంగాణ రైతంగా విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మామిడాల బాలమల్లేష్, గ్రామ సర్పంచ్ బేధారబోయిన యకమ్మ వెంకటేష్, రాఘవాపురం సర్పంచ్ పరిదే మమతా సంతోష్, మాజీ అధ్యక్షులు మామిడాల నర్సింహులు, సోమయ్య, మాజీ సర్పంచ్ గంగుల శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి మామిడాల అంజయ్య, మామిడాల భానుచందర్, మామిడాల అంజయ్య, అశోక్, మాజీ ఎంపిటిసి ప్రశాంత్, పిఎసిఎస్ డైరెక్టర్ చాడా రాజు, బండ విరమల్లయ్య, అరె మల్లేష్, సోమరాజు, బాలరాజు, మామిడాల నవీన్, భాను, శంకర్, ప్రసాద్, మధు, కర్ణాకర్, క్రాంతి, వార్డు సభ్యులు మరియు రజక కుటుంబ సభ్యులు వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు కుల సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

## కస్తూర్బా విద్యాలయంలో వైద్య శిబిరం

### 30 మంది విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకాలు.. ఆరోగ్యంపై అవగాహన

**హైదరాబాద్ పల్స్ న్యూస్,**



**నర్సింహులపేట, సెప్టెంబర్ 10:**

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరంలో 30 మంది విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకాలు వేసినట్లు వైద్యురాలు కవిత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దగ్గు, జలుబు, అలర్జీతో బాధపడుతున్న విద్యార్థినులకు అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకురాలు సుజాత, వార్డెన్ స్వప్న, ఎంఎల్‌హెచ్‌పీ అన్వేష్, ఏఎన్ఎంలు ప్రసన్నకుమారి, కృష్ణవేణి, సునీత, ఆశా కార్యకర్త సరస్వతి, ఉపాధ్యాయ బృందం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల సామాజిక మాధ్యమ వినియోగానికి
# తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేయాలి

**కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక నోటీసులు..**

**18 ఏళ్లలోపు పిల్లల భద్రతపై పటిష్ట నిబంధనలు కోరిన పిటిషన్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:** 18 ఏళ్లలోపు చిన్నారులు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వేదికలను వినియోగించే సమయంలో తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకుల అనుమతిని తప్పనిసరి చేయాలన్న డిమాండ్‌పై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. ఈ అంశంపై సమగ్ర వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది.భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లలోపు వారంతా మైనర్లే అయినప్పటికీ, కొన్ని ప్రముఖ సామాజిక మాధ్యమ వేదికలు 13 ఏళ్ల నుంచే స్వతంత్రంగా ఖాతాలు తెరిచేందుకు అవకాశం కల్పిస్తున్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.సమాచార సాంకేతిక నిబంధనలు--2021లో తగిన మార్పులు చేసి, తల్లిదండ్రుల ధ్రువీకరణ, ఎలక్ట్రానిక్ కేవైసీ పూర్తయ్యే వరకు 18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ వేదికలు ఒప్పందం చేసుకోకుండా నిబంధనలు రూపొందించాలని పిటిషన్‌లో కోరారు.ఆన్‌లైన్‌లో చిన్నారుల స్వతంత్ర వినియోగం వల్ల ఆన్‌లైన్ వేధింపులు, లైంగిక దోపిడీ, మానవ అక్రమ రవాణా, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, సైబర్ వేధింపులు, వయస్సుకు అనుచితమైన కంటెంట్ వంటి ప్రమాదాలు ఎదురయ్యే



అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.చిన్నారుల మానసిక స్థితిపై సామాజిక మాధ్యమాల్లోని ప్రవర్తనా ఆధారిత సమాచార సేకరణ ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, వారి రక్షణకు తక్షణమే పటిష్టమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

# సేవా కార్యక్రమాల్లో అల్లాడి వీరేశం ఆదర్శం!

**ఐదు దశాబ్దాలుగా దత్తగిరి ట్రస్ట్ సేవలు..**

**పీఠాధిపతుల ప్రశంసలు**

**భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు.. 250 మందికి వస్త్రదానం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జహీరాబాద్, సెప్టెంబర్ 10:**
శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఝరాసంగంలోని దత్తగిరి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మానవసేవే మాధవసేవగా భావిస్తూ ఐదు దశాబ్దాలుగా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అల్లాడి వీరేశం అభినందనీయుడని ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానంద గిరి కొనియాడారు.గురువారం అల్లాడి ఇందిరా వీరేశం కుటుంబ సభ్యులతో కలిసి ఆశ్రమంలో గోపూజ, జ్యోతిర్లింగాలకు రుద్రాభిషేకం, దత్తాత్రేయ స్వామివారికి పాదపూజ, గురుపాదుకా



పూజ నిర్వహించారు. అనంతరం వేద విద్యార్థులు, వృద్ధులు, ఆశ్రమానికి వచ్చిన భక్తులు కలిపి సుమారు 250 మందికి వస్త్రాలను పంపిణీ చేశారు.గత 50 ఏళ్లుగా అల్లాడి వీరేశం దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా కొనసాగుతూ వేద విద్య, వృద్ధాశ్రమం, నిత్య అన్నదానం, పేదల వివాహాలకు తనవంతు సహకారం అందిస్తున్నారని పీఠాధిపతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు రాచయ్య స్వామి, నందిని గిరి మాత, అల్లాడి అంకిత



సాయిరాం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. శ్రావణమాస ఉత్సవాల ముగింపు వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి తెలిపారు.

# మానసిక ఆరోగ్యంపై అవగాహన..గీతంలో ప్రత్యేక కార్యక్రమాలు

**'ఆత్మహత్యలపై కథనాన్ని మార్చడం.. చర్చను ప్రారంభించండి' ఇతివృత్తంతో కార్యక్రమాలు**

**కళంకాన్ని తొలగించి.. సహాయం కోరే వాతావరణం కల్పించడమే లక్ష్యం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, పటాన్ చెరు, సెప్టెంబర్ 10:**
ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని అనువర్తిత మనస్తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.'ఆత్మహత్యలపై కథనాన్ని



మార్చడం', 'చర్చను ప్రారంభించండి' అనే ఇతివృత్తంతో మానసిక ఆరోగ్యంపై బహిరంగ చర్చలను ప్రోత్సహించారు. భావోద్వేగ సమస్యలు ఎదుర్కొంటున్న వారు సంకోచం లేకుండా సహాయం కోరేలా సహాయక వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు.విద్యార్థులు, అధ్యాపకులు భావోద్వేగ శ్రేయస్సు, మానసిక ఆరోగ్య సమస్యలు, సహకారం, ఆశ, ఆత్మహత్యల నివారణ వంటి అంశాలపై ప్రదర్శనలు, కళాకృతులు, ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలు, కళంకాన్ని తొలగించి పరస్పర అవగాహన, సానుభూతి, సహకారాన్ని పెంపొందించడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రాంగణంలో శ్రద్ధ, అనుబంధం, మద్దతుతో కూడిన వాతావరణాన్ని బలోపేతం చేయడానికి తమ కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.

# ఉజ్జయిని ఖడే హనుమాన్: జేసీబీలు,
# క్రేన్లతో లాగినా అంగుళం కూడా కదలని హనుమాన్ విగ్రహం..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 10, సెంట్రల్ బ్యూరో :**
మధ్యప్రదేశ్ లోని ఉజ్జయిని నగరంలో ప్రాచీన కాలం నాటి హనుమాన్ ఆలయం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. జేసీబీలు, క్రేన్లతో లాగినా 170 ఏళ్ల నాటి హనుమాన్ విగ్రహం మాత్రం అంగుళం కూడా అక్కడినుంచి కదల్లేదని సమాచారం అందుతోంది. ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రాచీన హనుమాన్ ఆలయాన్ని అధికారులు తొలగించారు. అయితే అందులోని హనుమాన్ విగ్రహం మాత్రం అక్కడి నుంచి తరలించడం సాధ్యం కాలేదని తెలుస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించినా.. భారీ యంత్రాలతో ప్రయత్నించినా విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదని సమాచారం. కంతాల్ చౌరాహా- ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న ఖడే హనుమాన్ ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇక ఈ ఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**ఏం జరిగిందంటే..?**

ఉజ్జయినిలోని సింహస్థ 2028 కుంభమేళా ఏర్పాట్లలో భాగంగా రోడ్డు విస్తరణ పనులను స్థానిక అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఖడే హనుమాన్ విగ్రహాన్ని కూడా మరో ప్రాంతానికి తరలించనున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో స్టార్ట్ అయింది. అయితే హనుమాన్ విగ్రహాన్ని అక్కడి నుంచి




తరలించేందుకు అధికారులు, స్థానిక యంత్రాంగం తీవ్రంగా శ్రమించినట్లు సమాచారం. ఇండోర్ నుంచి ప్రత్యేకంగా నిపుణులను రప్పించి.. అత్యాధునిక సాంకేతికతను వినియోగించినా గడచిన రెండు రోజులుగా హనుమాన్ విగ్రహం అంగుళం కూడా పక్కకు జరగలేదు. దాంతో ఇది దైవశక్తి మహిమ అంటూ స్థానిక ప్రజలు, భక్తులు గట్టిగా నమ్ముతున్నారు.ఇక ఈ విషయంపై ఉజ్జయిని ఎస్.డి.ఎమ్ ఎల్.ఎన్. గార్గ్ వివరణ ఇచ్చారు. ఇప్పటివరకు ఖడే హనుమాన్ విగ్రహాన్ని తరలించేందుకు యంత్రాలతో కానీ, మానవ ప్రయత్నాలతో కానీ ఎలాంటి ప్రయత్నం చేయలేదని ఆయన తెలిపారు. విగ్రహాన్ని తరలించేందుకు పలుమార్లు ప్రయత్నించారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారం ప్రజల్ని తప్పుదోవ పట్టించేదని తెలిపారు. నిపుణుల పరిశీలన తర్వాత మాత్రమే ఈ విగ్రహం విషయంలో నిర్ణయం తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అలాగే విగ్రహం తరలింపు విషయంలో భక్తుల మనోభావాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు.





# ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మామిడాల భిక్షపతి, కార్యవర్గ సభ్యుడిగా బేజాడి కుమార్ ఎన్నిక

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఈ నెల 8,9న మంచిర్యాల పట్టణంలో జరిగిన అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభల్లో యాదాద్రి జిల్లాకు చెందిన మామిడాల భిక్షపతి రాష్ట్ర అధ్యక్షుడిగా, బేజాడి కుమార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 31మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని, విజయవంతంగా మహాసభలను ముగించుకున్నారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన మామిడాల భిక్షపతి గత 45 ఏళ్లుగా ప్రజా ఉద్యమాలు, రైతాంగ ఉద్యమాల్లో చురుకుగా పనిచేస్తున్నారు. రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాల్లో భాగస్వామ్యమై, రైతాంగ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలకంగా పనిచేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన రెండోసారి ఎన్నిక కావడం విశేషం.యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన బేజాడి కుమార్ విద్యార్థి, యువజన పోరాటాల నుంచి ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. విద్యార్థి, యువజన సమస్యలపై పోరాడుతూ, అనంతరం రైతాంగ, ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కుమార్ ఎన్నికయ్యారు.మామిడాల భిక్షపతి, బేజాడి కుమార్‌ల ఎన్నిక పట్ల యాదాద్రి జిల్లా రైతాంగ, ప్రజా ఉద్యమ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ విప్లవాభినందనలు తెలిపారు. రైతులు, కూలీల సమస్యలపై మరింత విస్తృతమైన పోరాటాలను నిర్మించి, ఏఐకేఎంఎస్ ను బలోపేతం చేయాలని వారు ఆకాంక్షించారు.





# పికిల్‌బాల్ ప్రపంచకప్‌లో గీతం విద్యార్థినికి రెండు పతకాలు!


**బాలికల సింగిల్స్‌లో రజతం.. డబుల్స్‌లో కాంస్యం**

**అంతర్జాతీయ వేదికపై ఆశ్రిత రాజు దాట్ల అద్భుత ప్రతిభ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, పటాన్ చెరు, సెప్టెంబర్ 10:**
వియత్నాంలో ఇటీవల జరిగిన పికిల్‌బాల్ ప్రపంచకప్-2026 పోటీల్లో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన బీబీఏ తొలి సంవత్సరం విద్యార్థిని ఆశ్రిత రాజు దాట్ల సత్తా చాటారు. 18 ఏళ్లలోపు విభాగంలో పాల్గొన్న ఆమె బాలికల సింగిల్స్‌లో రజత పతకం, డబుల్స్‌లో కాంస్య పతకం సాధించారు.ఒకే అంతర్జాతీయ పోటీలో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పతకాలు సాధించడం విశేషమని గీతం ప్రతినిధులు తెలిపారు. ఆశ్రిత క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనకు ఈ విజయం నిదర్శనమన్నారు.అంతర్జాతీయ వేదికపై గీతానికి ప్రాతినిధ్యం వహిస్తూ సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఆశ్రితను గీతం నాయకత్వం అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.

# సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

**సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం అందించిన ఎమ్మెల్యే శ్రీగణేష్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 10:**
సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో సెప్టెంబర్ 14 నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు హాజరు కావాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం శాసనసభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వేద ఆశీర్వచనం అందించారు. వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలను వారికి వివరించి, ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.






# ఇస్నాపూర్ కౌన్సిల్ సాధారణ సమావేశం

**వినాయక నిమజ్జనం, బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై చర్చ..**

**పారిశుద్ధ్యంపై కౌన్సిలర్ల సూచనలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, పటాన్చెరు, సెప్టెంబర్ 10:** ఇస్నాపూర్ కౌన్సిల్ సాధారణ సమావేశం లక్డారం వార్డు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి కౌన్సిలర్లు, ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్‌రావుతో పాటు మున్సిపల్ సిబ్బంది హాజరయ్యారు.సమావేశంలో వినాయక చవితి సందర్భంగా చేపట్టాల్సిన నిమజ్జన ఏర్పాట్లు, ఇందుకు అవసరమైన ఖర్చులు, నిధుల ఆమోదంపై చర్చించారు. అలాగే రాబోయే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించాల్సిన కార్యక్రమాలు, వాటికి సంబంధించిన వ్యయాలను ఆమోదించారు.మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై కౌన్సిలర్లు వివిధ అంశాలను ప్రస్తావించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



# మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

**తెలంగాణ భూ పోరాటానికి నాంది పలికిన వీరనారి జీవితం స్ఫూర్తిదాయకం.**

**ఎమ్మెల్యే జీఎంఆర్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, పటాన్‌చెరు, సెప్టెంబర్ 10:** గడీల పెత్తనానికి ఎదురు నిలిచి, తెలంగాణలో భూ పోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మ మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రజక సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆమె పోరాట స్ఫూర్తి మహిళా చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఆమె సేవలను గుర్తిస్తూ హైదరాబాద్‌లోని మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారని, ఆమె వారసులకు కూడా సముచిత గౌరవం కల్పించారని పేర్కొన్నారు.ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు మహేష్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లను వేధిస్తున్న ప్రభుత్వం..

**విజిలెన్స్ దాడులు నిలిపివేయాలి: ప్రభాకర్ గుప్త**

**నేటి చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, గజ్వేల్, సెప్టెంబర్ 10:** రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం వివిధ కారణాలను సాకుగా చూపుతూ వేధిస్తోందని గజ్వేల్ ఏరియా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ గుప్త విమర్శించారు. గురువారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.క్వింటా ధాన్యానికి 60 శాతానికి మించి బియ్యం లభించదని, అయితే ప్రభుత్వం 67 కిలోల బియ్యం ఇవ్వాలని నిబంధనలు విధించడం సరికాదని అన్నారు. ఒకరిద్దరు మిల్లర్లు తప్పు చేస్తే మొత్తం మిల్లింగ్ రంగాన్ని దోషులుగా చూడటం తగదని పేర్కొన్నారు.రైస్ మిల్లర్లకు విద్యుత్ సమస్య పరిష్కారం, మిల్లింగ్ చార్జీల పెంపు, కఠినమైన భారత ఆహార సంస్థ నిబంధనల సడలింపు, 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్లుగా ప్రభుత్వం మిల్లర్లకు చెల్లించాల్సిన వివిధ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.అలాగే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ దాడులను నిలిపివేయాలని, సీఎంఆర్ ఒప్పందం ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా ఉండాలని, పాత గన్నీ బ్యాగుల ధరను రూ.11కు తగ్గించాలని కోరారు.రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభాకర్ గుప్త పిలుపునిచ్చారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**గణేష్ మండపాల వద్ద భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి**

**ఎసిపి శ్రీనివాస్ నాయుడు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు పట్టణంలో మండల పరిషత్ కార్యాలయంలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై మండపాల నిర్వాహకులతో అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై అధికారులు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎసిపి శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట రూరల్ సీఐ మదాస్ శంకర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిజన బాలమణి భాస్కర్, ఎమ్మార్వో ఆంజనేయులు, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్, ఎస్ఐ వినయ్ కుమార్, ఫైర్ అధికారి హమీద్ లు, పలు భద్రతా సూచనలు చేశారు. గణేష్ మండపాల వద్ద భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో ఉత్సవాలను నిర్వహించాలని అధికారులు సూచించారు.మండపాల వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులతో మండపాల నిర్వాహకులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. మంటపాల వద్ద డీజెలు నిషేధమని నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని వివరించారు ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, గణేష్ యూత్ సభ్యులు, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవల్లి రోడ్ల శుద్ధితో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

**కేసీఆర్ ఎర్రవల్లి వీడే వరకు నిరసనలు:**

**పోతగల్ల రవీందర్**

**దళితుల చైతన్యం కోసం త్వరలో కార్యాచరణ ప్రకటిస్తాం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, వర్గల్, సెప్టెంబర్ 10:** ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌజ్ ముట్టడి అనంతరం రోడ్లను పసుపు నీళ్లు, పాలతో శుభ్రం చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పోతగల్ల రవీందర్, మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, వర్గల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వర్గల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దళితులు, దళిత సంఘాల నాయకులు దప్పుల మోతతో ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌజ్‌ను ముట్టడించారని తెలిపారు. అనంతరం రహదారులను పసుపు నీళ్లు, పాలతో శుద్ధి చేయడం తీవ్రంగా బాధించిందన్నారు.ఈ ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలతోనే రోడ్ల శుద్ధి జరిగిందని తాము భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. దళితులను అవమానించే చర్యలకు వ్యతిరేకంగా త్వరలో దళిత చైతన్య కార్యక్రమాలకు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.సమాజంలోని శుభ, అశుభ కార్యక్రమాల్లో దళితుల సేవలు అవసరమైనప్పటికీ కుల వివక్ష, అస్పృశ్యత, అంటరానితనాన్ని ప్రోత్సహించేలా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన మరింత బాధ కలిగించిందని తెలిపారు.దళితుల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్‌కు దళితులు తన దారిలో నడవడం కూడా ఇష్టం లేకపోయిందని వారు ఆరోపించారు. కేసీఆర్ ఎర్రవల్లిలో ఉన్నంతకాలం దళితులు సంఘటితంగా నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.దళితుల మనోభావాలను దెబ్బతీసిన కేసీఆర్, బీఆర్ఎస్ నేతలకు తగిన సమాధానం చెప్పేందుకు పార్టీలకు అతీతంగా దళితులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. దళిత మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత, విద్యార్థులు ఈ అంశంపై సంఘటితంగా ముందుకు రావాలని కోరారు.



# చక్కెర సెంచరీ..వంటనూనె డబుల్ సెంచరీ!

**నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్యులపై పెరుగుతున్న భారం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెంట్రల్ డెస్క్, సెప్టెంబర్ 10:** నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. రోజువారీ వంటల్లో తప్పనిసరిగా వినియోగించే చక్కెర, వంటనూనె ధరలు పెరగడంతో కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై అదనపు భారం పడుతోంది. హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని స్థానిక కిరాణా దుకాణాల్లో కిలో చక్కెర ధర రూ.100కు చేరగా.. వంటనూనె ధర లీటరుకు రూ.200 మార్కును దాటింది.ప్రస్తుతం పలు కిరాణా దుకాణాల్లో కిలో చక్కెరను రూ.100 వరకు విక్రయిస్తున్నారు. అయితే పెద్ద దుకాణాలు, అంతర్జాల విక్రయ వేదికల్లో అదే చక్కెర రూ.75 నుంచి రూ.80 మధ్య లభిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకే ఉత్పత్తికి దుకాణాన్ని బట్టి ధరల్లో గణనీయమైన వ్యత్యాసం కనిపిస్తోంది.మరోవైపు వంటనూనె ధరలు కూడా వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అంతర్జాల విక్రయ వేదికల్లో కొన్ని రకాల వంటనూనెల లీటరు సీసా ధర రూ.202 వరకు ఉండగా, ప్యాకెట్




ధర సుమారు రూ.182గా ఉంది. స్థానిక కిరాణా దుకాణాల్లో వీటి ధరపై మరో రూ.5 నుంచి రూ.10 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు.ఇప్పటికే కూరగాయలు, పప్పులు, ఇతర నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు చక్కెర, వంటనూనె ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది. వారానికోసారి లేదా నెలకోసారి పెద్ద మొత్తంలో సరుకులు కొనుగోలు చేసే కుటుంబాలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.స్థానిక దుకాణాల్లో ధరలు అధికంగా ఉండటంతో కొందరు వినియోగదారులు పెద్ద దుకాణాలు, అంతర్జాల విక్రయ వేదికల్లో ధరలను పరిశీలించి కొనుగోలు చేస్తున్నారు. అయితే అంతర్జాలంలో కొనుగోలు చేసే అవకాశం లేని ప్రజలు స్థానిక దుకాణాలపైనే ఆధారపడాల్సి రావడంతో కొంత అధిక ధర చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు.

**గరిష్ఠ చిల్లర ధరపై తనిఖీలు చేయాలి**

ప్యాకెట్లపై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువగా విక్రయిస్తున్నారా? లేదా? అనే అంశంపై అధికారులు తనిఖీలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. ఒకే ఉత్పత్తికి ప్రాంతాలు, దుకాణాలను బట్టి ధరల్లో భారీ వ్యత్యాసం ఎందుకు ఉంటుందనే అంశంపైనా మార్కెట్ పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.చక్కెర కిలోకు రూ.100కు చేరడం, వంటనూనె లీటరుకు రూ.200 దాటడం సామాన్య కుటుంబాలపై నేరుగా ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

# పుతిన్ రాకకు ముందే రష్యా భద్రతా బృందాల హడావుడి!

**నోయిడా విమానాశ్రయంలో మూడు రష్యా సైనిక విమానాలు.. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటనకు ముందే భద్రతా ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో రష్యాకు చెందిన మూడు సైనిక విమానాలు నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాయి. పుతిన్ పర్యటనకు సంబంధించిన ముందస్తు భద్రతా బృందం, ఉన్నతాధికారులు భారత్‌కు చేరుకున్నట్లు సమాచారం.మంగళవారం తెల్లవారుజామున సుమారు 5.30 గంటల సమయంలో భారీ రవాణా విమానం ఐఎల్-76తో పాటు మరో రెండు రష్యా సైనిక విమానాలు నోయిడా విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యాయి. అనంతరం రష్యా భద్రతా సిబ్బంది, భారత భద్రతా సంస్థలు కలిసి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా మార్గాలు, ఇతర అంశాలను పరిశీలించినట్లు తెలిసింది.

**కొత్త విమానాశ్రయంపై ప్రత్యేక దృష్టి**

విదేశీ ప్రముఖుల పర్యటనల్లో సాధారణంగా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వినియోగిస్తారు. అయితే ఈసారి నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయంలో రష్యా సైనిక విమానాలు దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారీ రవాణా విమానాల నిర్వహణ, ఉన్నతస్థాయి భద్రతా ఏర్పాట్ల సామర్థ్యాన్ని పరీక్షించే అవకాశంగా దీనిని పరిగణిస్తున్నారు.




**సెప్టెంబర్ 11న మోదీ-పుతిన్ భేటీ**

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. అంతకుముందు సెప్టెంబర్ 11న ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ సమావేశంలో రక్షణ సహకారం, ఎస్-400 వ్యవస్థల సరఫరా, సైనిక సాంకేతికత, బ్రహ్మోస్ తదితర అంశాలపై చర్చకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## పులి ఎముకలు..చిరుత చర్మాలు..

# అరుదైన వన్యప్రాణుల అక్రమ రవాణా గుట్టురట్టు

**దేశవ్యాప్తంగా డీఆర్ఐ ఆరు ఆపరేషన్లు..**
**13 మంది అరెస్టు**
**180 నక్షత్ర తాబేళ్లు, 24 కిలోలకు పైగా పాంగోలిన్ పొలుసులు స్వాధీనం**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:** అరుదైన, అంతరించిపోతున్న వన్యప్రాణులు, వాటి అవయవాలను అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాలపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు దేశవ్యాప్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించారు. గత పది రోజులుగా చేపట్టిన ఆరు వేర్వేరు ఆపరేషన్లలో చిరుతపులి చర్మాలు, నక్షత్ర తాబేళ్లు, టోకే గేకోలు, పాంగోలిన్ పొలుసులు, పులి ఎముకలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో 13 మందిని అరెస్టు చేశారు.

**ఒడిశాలో చిరుత చర్మం స్వాధీనం**

సెప్టెంబర్ 7న ఒడిశాలోని కోరాపుట్ జిల్లా జైపూర్ సమీపంలో డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా చిరుతపులి చర్మం లభించింది. చిరుతపులులకు వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద అత్యున్నత రక్షణ ఉంది. నిందితుడిని, స్వాధీనం చేసుకున్న చర్మాన్ని తదుపరి చర్యల కోసం అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

బెంగళూరులో 180 నక్షత్ర తాబేళ్లు

అదే రోజు కర్ణాటకలోని బెంగళూరు గాంధీనగర్ సమీపంలో మరో బృందం అనుమానితుడిని అడ్డుకుని అతడి బ్యాగులను తనిఖీ చేసింది. ఆరు బట్టల సంచుల్లో దాచిన 180 బతికున్న భారతీయ నక్షత్ర తాబేళ్లు బయటపడ్డాయి. వీటిని వన్యప్రాణి నేర నియంత్రణ విభాగం అరుదైన జాతిగా గుర్తించింది. అంతర్జాతీయ అక్రమ పెంపుడు జంతువుల మార్కెట్‌లో వీటికి డిమాండ్ ఉండటంతో స్మగ్లర్లు లక్ష్యంగా చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు.

**మేఘాలయలో పాంగోలిన్ పొలుసులు**

మరో ఆపరేషన్‌లో మేఘాలయలోని రి-భోయ్ జిల్లాలో గౌహతి వైపు వెళ్తున్న వాహనాన్ని అధికారులు అడ్డుకున్నారు. మూడు సంచుల్లో దాచిన 14.68 కిలోల ఎండిన పాంగోలిన్ పొలుసులను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల అక్రమ రవాణాలో పాంగోలిన్‌లు ఎక్కువగా లక్ష్యంగా మారుతున్నాయి. స్వాధీనం చేసుకున్న పొలుసులు, వాహనం, నిందితుడిని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.డీఆర్ఐ అధికారులు నిర్వహించిన ఇతర ఆపరేషన్లలో మరో చిరుతపులి చర్మం, టోకే గేకోలు, పులి ఎముకలు, అదనపు పాంగోలిన్ పొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అరుదైన వన్యప్రాణుల అక్రమ వేట, రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ముఠాలపై నిఘా కొనసాగుతుందని తెలిపారు.

# హిందీలో బ్లాక్‌బస్టర్.. త్వరలో తెలుగులో 'హనుమాన్ అంశ'!

**తెలుగులో విడుదలకు సిద్ధమవుతున్న నీమ్ కరోలీ బాబా జీవితకథ ఆధారిత చిత్రం.**
**తెలుగు వెర్షన్ విడుదల బాధ్యతలు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు**




**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
నీమ్ కరోలీ బాబా జీవిత చరిత్ర ఆధారంగా విశాల్ చతుర్వేది తెరకెక్కించిన చిత్రం 'హనుమాన్ అంశ' హిందీలో ఘన విజయం సాధించింది. ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం విడుదలైన 33వ రోజున కూడా భారీ వసూళ్లు సాధించి రికార్డు సృష్టించింది.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఈ చిత్రం రూ.169 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. త్వరలోనే రూ.200 కోట్ల వసూళ్ల మైలురాయిని చేరే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. హిందీలో ఘన విజయం సాధించిన 'హనుమాన్ అంశ'ను త్వరలో తెలుగులోకి అనువదించి విడుదల చేయనున్నట్లు సమాచారం. 'అల వైకుంఠపురములో', 'గుంటూరు కారం' చిత్రాల దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెలుగు వెర్షన్ విడుదల బాధ్యతలను చేపట్టినట్లు చిత్ర నిర్మాత నమ్రతా సింగ్ వెల్లడించారు.తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# ఆత్మవిశ్వాసమే ముద్దు.. ఆత్మహత్యలు వద్దు

**కలిసి పనిచేద్దాం.. ఆత్మహత్యలను నివారిద్దాం: ఎస్సై బి. రవికుమార్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, నర్సింహులపేట, సెప్టెంబర్ 10:**
ఆత్మవిశ్వాసంతో సమస్యలను ఎదుర్కొని జీవితంలో లక్ష్యాలను సాధించాలని ఎస్సై బి. రవికుమార్ సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా దంతాలపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అకాడమీ ఆధ్వర్యంలో 'ఆత్మహత్యలు వద్దు.. జీవితమే ముద్దు' అనే గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్సై బి. రవికుమార్ మాట్లాడుతూ మానవ జన్మ ఎంతో విలువైనదని, ఎన్ని సమస్యలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమించాలని అన్నారు. అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని, మంచి ఆలోచనలు, మంచి పనులతో జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా ఆలోచనా విధానంలో మార్పు వస్తుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కోరారు.అకాడమీ డైరెక్టర్, కవి, రచయిత, వ్యక్తిత్వ వికాస శిక్షకుడు, ఈగల్ సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చిర్ర సతీష్ మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పనిచేయాలని అన్నారు. చిన్నచిన్న సమస్యలకు జీవితాన్ని ముగించుకోవడం సరైన నిర్ణయం కాదని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు.తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 100కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో వ్యక్తిత్వ వికాస సదస్సులు నిర్వహించి, 10 వేల మందికి పైగా విద్యార్థులకు జీవితంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఉత్తమ వ్యక్తిత్వంతో కూడిన భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు."ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు.. జీవితాన్ని నిలబెట్టుకోవడమే నిజమైన విజయం" అని పేర్కొంటూ, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలో ఉన్న వారిని గుర్తించి వారికి సకాలంలో తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. కనీసం ఒక్కరి ప్రాణాన్నైనా కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది సాయికృష్ణ, సురేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.




# ఓల్డ్ బోయినపల్లిలో బీజేపీలోకి భారీగా యువత చేరిక

**కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ ఈటల రాజేందర్**
**జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి సమష్టిగా పనిచేయాలి: ఈటల**

**ఓల్డ్ బోయినపల్లి, సెప్టెంబర్ 10 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లో రవికుమార్, భరత్, నాగరాజు, బార్గవి, తేజ, గిరిష్ ఆధ్వర్యంలో వందలాది మంది యువత బీజేపీలో చేరారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏనుగుల తిరుపతి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై నిరాశ నెలకొందన్నారు. పెన్షన్ పెంపు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం, విద్యార్థులకు విద్యానిధి వంటి హామీల అమలుపై ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.పేదలు నివసించే కాలనీలు, బస్తీల్లో ఇళ్ల కూల్చివేతల అంశంపై ప్రజల్లో ఆందోళన నెలకొందని తెలిపారు. హైడ్రా పేరుతో ఇళ్ల విషయంలో తీసుకుంటున్న చర్యలపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా ఉండాలని అన్నారు.తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, పేదలకు గృహాలు, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు బీజేపీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈటల రాజేందర్ అన్నారు. ఓల్డ్ బోయినపల్లిలో యువత పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు.నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు, కూకట్‌పల్లి ఇన్‌చార్జి కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, కార్యక్రమ నిర్వాహకులు తిరుపతి యాదవ్, డివిజన్ అధ్యక్షులు సంతోష్, పప్పు పటేల్, రఘు తదితరులు పాల్గొన్నారు.







# బోడ సమ్మయ్య అంత్యక్రియల్లో ఎమ్మెల్యే మాణిక్ రావు

**పలువురు ప్రజాప్రతినిధులు, నాయకుల నివాళులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యాల్కల్, సెప్టెంబర్ 10:**
మాజీ న్యాల్కల్ జెడ్పీటీసీ భాస్కర్ తండ్రి బోడ సమ్మయ్య అంత్యక్రియల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా సమ్మయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మాణిక్ రావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



# "ఏడేళ్ల తర్వాత ముఖాముఖి.. ప్రధాని మోదీ-జిన్‌పింగ్ బిగ్ మీట్!"

**సెప్టెంబర్ 12న ఢిల్లీలో కీలక సమావేశం.. సరిహద్దు ప్రశాంతత, వాణిజ్య అంశాలపై చర్చకు అవకాశం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:**
భారత్, చైనా దేశాల మధ్య సంబంధాల్లో కీలక పరిణామానికి రంగం సిద్ధమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సెప్టెంబర్ 12న న్యూఢిల్లీలో సమావేశం కానున్నట్లు సమాచారం. తూర్పు లడఖ్‌లో 2020లో చోటుచేసుకున్న సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత ఇరు దేశాల అగ్రనేతల మధ్య జరిగే ఈ భేటీపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.భారత్ నిర్వహిస్తున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ సమావేశం జరగనుంది. ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడంలో భాగంగా గత కొంతకాలంగా దౌత్యపరమైన చర్చలు కొనసాగుతున్నాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనా పర్యటనతో పాటు సరిహద్దు అంశాలపై ఇరు దేశాల ప్రతినిధుల మధ్య వరుస చర్చలు జరిగాయి.

**సరిహద్దు, వాణిజ్యంపైనే ప్రధాన దృష్టి**

మోదీ--జిన్‌పింగ్ భేటీలో వాస్తవాధీన రేఖ వెంబడి శాంతి, సరిహద్దు ఉద్రిక్తతలను నివారించే చర్యలు, ద్వైపాక్షిక వాణిజ్యం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. అంతర్జాతీయ పరిణామాలు, ఆర్థిక సంబంధాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది.సరిహద్దు భద్రత విషయంలో రాజీ లేకుండా, ఆర్థిక సంబంధాలను మెరుగుపర్చే దిశగా భారత్ తన వైఖరిని కొనసాగించనుంది. ఈ భేటీ ఇరు దేశాల భవిష్యత్ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.




# అసెంబ్లీ ముట్టడికి యత్నం: మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ గృహ నిర్బంధం

**సెప్టెంబర్ 10, ఓల్డ్ బోయిన్‌పల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
అసెంబ్లీ సమావేశాల ముట్టడి పిలుపు నేపథ్యంలో ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌ను బోయిన్‌పల్లి పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం (హౌస్ అరెస్ట్) చేశారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు వెళ్లకుండా పోలీసులు తన నివాసం వద్దే అడ్డుకోవడంపై ఆయన తీవ్రంగా ఖండించారు.ప్రజల గొంతుకను అణిచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని ఈ సందర్భంగా నర్సింహ యాదవ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు దిగినా ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు గణేష్, బుర్రి యాదగిరి తదితరులు ఉన్నారు.






# కలెక్టరేట్‌లో గణేష్ ఉత్సవాల శాంతి కమిటీ సమావేశం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో గణేష్ ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపిఎస్ మాట్లాడుతూ... శాంతిభద్రతలు, ఊరేగింపులు, నిమజ్జనం మరియు ప్రజల భద్రతపై పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఐఎఎస్ మాట్లాడుతూ...భద్రతా చర్యలు, పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, ఎసిపి శ్రీనివాస్ నాయుడు, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, టిపిసిసి సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్ వివిధ శాఖల అధికారులు, జిల్లా శాంతి కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. పోలీస్ శాఖ, మున్సిపల్ శాఖ, పారిశుధ్య శాఖ, విద్యుత్ శాఖ, ఫైర్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలి అని అన్నారు. శాంతియుతమైన సురక్షితమైన పర్యావరణహిత గణేష్ ఉత్సవాలే మన లక్ష్యం అని అన్నారు



# బాధిత కుటుంబాన్ని వార్డు సభ్యురాలు చేయూత

**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 10, నర్సింహులపేట :**
వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి నిత్యం ప్రజల కష్టసుఖాల్లో ఆరవ వార్డు సభ్యురాలు ఎస్.కె. హసీనా బేగం అండగా నిలుస్తున్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన సురబోయిన చంద్రమ్మ ఇటీవల మృతి చెందడంతో, ఆమె కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులతో కలసి దశదినకర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించి 25 కేజీల బియ్యాన్ని అందించారు. దీంతో ఒక మహిళ వార్డు సభ్యురాలుగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ మండలంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. దీంతో ఆమె గెలిచిన నాటినుండి ప్రజల సమస్యలే ప్రధాన ధ్యేయంగా ప్రతి పనిలో ముందుంటున్నారని అటు ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రశంసలతో కురిపిస్తున్నారు. అనంతరం మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జినుకల రమేష్ కుటుంబ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెదమాముల యాకయ్య, ఉపసర్పంచ్ కసా యాకన్న, మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ చిర్ర సతీష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహబూబ్ పాషా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా సాయి సచ్చరిత్ర సప్త సప్తాహ పారాయణం ప్రారంభం

## ధుని వద్ద దత్త హోమం.. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ






**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఓల్డ్ బోయినపల్లి, సెప్టెంబర్ 10:** శ్రీ ద్వారకామాయి 30వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా అఖండ శ్రీ సాయి సచ్చరిత్ర సప్త సప్తాహ పారాయణ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీ సాయి శివ శక్తి సమాజం ఆధ్వర్యంలో ఓల్డ్ బోయినపల్లిలోని సాయి కృష్ణ కాలనీలో ఉన్న సాయి బాబా ఆలయ ధ్యాన మందిరంలో ఈ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 10 నుంచి అక్టోబర్ 29 వరకు 49 రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు సాయి సచ్చరిత్ర పారాయణం కొనసాగనుంది. కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ధుని వద్ద దత్త హోమాన్ని నిర్వహించి, అనంతరం సాయి సచ్చరిత్ర పారాయణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పారాయణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి శివ శక్తి సమాజం సభ్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 17 ఏళ్లలో 11 దేశాలు.. ప్రపంచ శక్తిగా బ్రిక్స్ ఎదుగుదల!

**నలుగురితో మొదలై 11 దేశాలకు విస్తరణ.. ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాల్లో కీలక వేదికగా బ్రిక్స్**

**అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకకు బలమైన వేదిక.. ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక సహకారంపై దృష్టి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్ ప్రత్యేక కథనం, సెప్టెంబర్ 10 :**
ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభావాన్ని పెంచే వేదికగా బ్రిక్స్ కూటమి తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. 2009లో నాలుగు దేశాలతో ప్రారంభమైన ఈ కూటమి.. కేవలం 17 ఏళ్లలో 11 దేశాలకు విస్తరించి అంతర్జాతీయ స్థాయిలో కీలక వేదికగా ఎదిగింది.

**నాలుగు దేశాలతో ఆరంభం**
బ్రెజిల్, రష్యా, భారత్, చైనా దేశాలతో 'బ్రిక్'గా ఈ కూటమి ఏర్పడింది. 2009లో తొలి శిఖరాగ్ర సమావేశం నిర్వహించడంతో బ్రిక్స్ ప్రస్థానం అధికారికంగా ప్రారంభమైంది. అనంతరం 2011లో దక్షిణాఫ్రికా చేరడంతో 'బ్రిక్' కాస్త 'బ్రిక్స్'గా మారింది.




**వరుసగా సభ్యదేశాల చేరిక**
కాలక్రమేణా కూటమి తన పరిధిని విస్తరించింది. 2024లో ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరాయి. 2025లో ఇండోనేషియా కూడా సభ్యదేశంగా చేరడంతో బ్రిక్స్‌లో సభ్యదేశాల సంఖ్య 11కి చేరింది. దీంతో ప్రపంచ జనాభా, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, ఇంధనం వంటి కీలక రంగాల్లో బ్రిక్స్ ప్రాధాన్యం మరింత పెరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ వ్యవహారాల్లో వాటి పాత్రను పెంచే ప్రయత్నాలకు ఈ వేదిక ప్రాధాన్యం ఇస్తోంది.

**ఆర్థిక సహకారమే ప్రధాన లక్ష్యం**
సభ్యదేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాల బలోపేతం, పెట్టుబడుల ప్రోత్సాహం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, భద్రత, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలపై బ్రిక్స్ దృష్టి సారిస్తోంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, ప్రపంచ పాలనా వ్యవస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే అంశాన్ని కూడా బ్రిక్స్ దేశాలు ముందుకు తీసుకెళ్తున్నాయి.

2026లో మరింత కీలక చర్చలు
2026 బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో స్థిరమైన అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం, సభ్యదేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలు కీలకంగా మారే అవకాశం ఉంది. నలుగురు దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్.. దక్షిణాఫ్రికా చేరికతో ఐదు దేశాలకు, ఆ తర్వాతి విస్తరణలతో 11 దేశాల వేదికగా మారింది. ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో వేగంగా మారుతున్న సమీకరణాల నేపథ్యంలో బ్రిక్స్ విస్తరణ.. భవిష్యత్తులో ఈ కూటమి ప్రభావాన్ని మరింత పెంచే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 28 కమ్యూనిటీ హాళ్లకు రూ.8.50 కోట్లు

**కంటోన్మెంట్ అభివృద్ధికి కీలక ముందడుగు.. ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ప్రజల కృతజ్ఞతలు**

**పికెట్, సెప్టెంబర్ 10 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని 28 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, అసంపూర్తి పనుల పూర్తి, మరమ్మతులు, అదనపు సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.8.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. నిధుల మంజూరుకు కృషి చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు పలువురు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో వార్డు-4 బాలాంజనేయ స్వామి ఆలయ ప్రాంతం, ఫిషర్‌పురా, వార్డు-5 సంజీవయ్యనగర్‌కు చెందిన ప్రజలు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కమ్యూనిటీ హాళ్ల



అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. మంజూరైన నిధులతో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్ల పనులను పూర్తి చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# భారత్ అంతరిక్ష ప్రయాణంలో భాగస్వాములు కండి.. ప్రపంచ దేశాలకు మోదీ పిలుపు

**2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రం.. 2040లో చంద్రుడిపై భారత వ్యోమగామి**

**ఇప్పటికే 34 దేశాల 430 ఉపగ్రహాల ప్రయోగం.. ప్రపంచ దేశాలకు ప్రధాని మోదీ పిలుపు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
భారత్ చేపడుతున్న అంతరిక్ష ప్రయాణంలో ప్రపంచ దేశాలు భాగస్వాములు కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భారత అంతరిక్ష కార్యక్రమాన్ని కేవలం దేశ ప్రయాణంగా కాకుండా ప్రపంచ దేశాలతో కలిసి ముందుకు సాగే సహ ప్రయాణంగా భావించాలని కోరారు. పారిస్‌లో నిర్వహించిన తొలి అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతరిక్ష రంగంలో భారత్ సామర్థ్యం వేగంగా విస్తరిస్తోందని ప్రధాని తెలిపారు. దేశీయంగా అభివృద్ధి చేసిన రాకెట్ల ద్వారా ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపినట్లు వెల్లడించారు. దీంతో అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో భారత్ విశ్వసనీయ భాగస్వామిగా ఎదుగుతోందని పేర్కొన్నారు.

**2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రం**
భారత్ భవిష్యత్ అంతరిక్ష లక్ష్యాలను కూడా మోదీ వివరించారు. 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అంతరిక్ష పరిశోధన, సాంకేతిక సామర్థ్యాలను మరింత విస్తరించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

**2040లో చంద్రుడిపై భారత వ్యోమగామి**
2040 నాటికి భారత వ్యోమగామిని చంద్రుడిపైకి పంపడం దేశం నిర్దేశించుకున్న మరో కీలక లక్ష్యమని ప్రధాని తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులు, అంతరిక్ష రంగ సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వెల్లడించారు. అంతరిక్ష సాంకేతికతను శాంతియుత



ప్రయోజనాలకు వినియోగిస్తూ ప్రపంచ దేశాలతో సహకారాన్ని మరింత పెంచుకోవాలని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ ప్రయోగాలు, సాంకేతిక అభివృద్ధి రంగాల్లో పరస్పర భాగస్వామ్యంతో ప్రపంచానికి మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చని తెలిపారు. భారత్ అంతరిక్ష రంగంలో సాధిస్తున్న పురోగతి దేశ సాంకేతిక సామర్థ్యాన్ని మాత్రమే కాకుండా ప్రపంచానికి ఉపయోగపడే కొత్త అవకాశాలను కూడా సృష్టిస్తోందని ప్రధాని పేర్కొన్నారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోవాలి

**బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జేఏసీ కో-కన్వీనర్ బిచ్యా నాయక్ డిమాండ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో నంబర్ 641ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జేఏసీ కో-కన్వీనర్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు బిచ్యా నాయక్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయం కేవలం చెత్త నిర్వహణకు సంబంధించిన అంశం కాదని, ప్రజల ఆరోగ్యం, రైతుల భూములు, పర్యావరణం, భవిష్యత్ తరాలపై ప్రభావం చూపే తీవ్రమైన ప్రజా సమస్య అని అన్నారు. సిద్దాపూర్ ప్రాంతంలో వ్యవసాయ భూములతో పాటు విద్యార్థులు చదువుతున్న గురుకులం, ప్రజల విశ్వాసానికి సంబంధించిన జహంగీర్ పీర్ దర్గా వంటి ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి సున్నితమైన ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ప్రజల ఆరోగ్యం కంటే డంపింగ్ యార్డ్ ముఖ్యమా? రైతుల భూముల కంటే చెత్త నిల్వ ముఖ్యమా?" అని బిచ్యా నాయక్ ప్రభుత్వాన్ని నిలదీశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయబోమని గతంలో ప్రజలకు హామీలు ఇచ్చిన నాయకులు, ఇప్పుడు జీవో 641 వెలువడిన తర్వాత ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా ఏ నిర్ణయాన్ని రుద్దడం సరికాదని అన్నారు. ఈ పోరాటం ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, పార్టీలకు అతీతంగా సిద్దాపూర్ ప్రజల ప్రయోజనం కోసం కొనసాగుతున్న ప్రజా ఉద్యమమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యపై పోరాడేందుకు ముందుకు వచ్చే ప్రతి ఒక్కరినీ జేఏసీ స్వాగతిస్తుందని తెలిపారు.



# ప్రగతి బాటలో ప్రజా పాలన.. 7వ డివిజన్‌లో 1000 రోజుల సంబరాలు

**సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించిన కాంగ్రెస్ నాయకులు**

**రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించిన నాయకత్వం**

**గోదావరిఖని, సెప్టెంబర్ 10 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
తెలంగాణలో ప్రజా పాలనకు 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖని 7వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, మేయర్ మహంకాళి స్వామి సూచనలతో డివిజన్ కార్పొరేటర్ వేగోళపు రమాదేవి (గంగ), శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో, డివిజన్ ఇన్‌చార్జి బెందె నాగభూషణం గౌడ్ సహకారంతో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు.

**భారీ అభివృద్ధి పనులు**
రామగుండం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సుమారు 1,200 ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమానికి రూ. 120 కోట్ల నిధులు కేటాయించినట్లు నాయకులు తెలిపారు. రూ. 230 కోట్లతో సమీకృత పాఠశాలల నిర్మాణం, గోదావరిఖని పీజీ కేంద్రంలో రూ. 8 కోట్లతో నూతన పరిపాలనా భవనం నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అలాగే వైద్య కళాశాలలో అదనంగా 600 పడకల కోసం రూ. 200 కోట్లతో ఆరు అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్‌గా రూ. 5 వేల చెల్లింపునకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**మౌలిక వసతులపై దృష్టి**
రామగుండం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో 60 అడుగులు, 40 అడుగుల వెడల్పుతో రహదారుల నిర్మాణం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి కాల్వ లింగస్వామి, రవి కుమార్, బెందె నాగభూషణం గౌడ్, ఓదెలు యాదవ్, గోపగోని సతీష్ గౌడ్, జనగామ వినోద్, జంగిలి రాజేష్, ఆవునూరి సంజీవ్, పుట్ట నాగరాజు






తదితరులతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత్ వద్ద 190 అణు వార్‌హెడ్‌లు

**గతేడాదితో పోలిస్తే 10 పెరిగినట్లు అంచనా**

**అణు త్రివిధ ప్రయోగ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తున్న భారత్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో భారత్ తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు అమెరికాకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ అంచనా వేసింది. తాజా నివేదిక ప్రకారం భారత్ వద్ద ప్రస్తుతం సుమారు 190 అణు వార్‌హెడ్‌లు ఉన్నట్లు పేర్కొంది. బహిరంగ సమాచారం, వాణిజ్య ఉపగ్రహ చిత్రాలు, ప్రభుత్వ అధికారిక వివరాలను విశ్లేషించి ఈ అంచనాను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. వీటిలో 160కి పైగా అణు వార్‌హెడ్‌లు ప్రయోగ వ్యవస్థలకు సిద్ధంగా ఉండగా, మరో 30 కొత్త క్షిపణుల కోసం ఉత్పత్తి దశలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. గతేడాది భారత్ వద్ద సుమారు 180 అణు వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనా వేయగా.. ఈ




ఏడాది ఆ సంఖ్య 190కి చేరినట్లు పేర్కొంది.

**730 కిలోల ఆయుధ స్థాయి ప్లుటోనియం**
2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల ఆయుధ స్థాయి ప్లుటోనియం ఉండవచ్చని అంచనా. ఒక్కో అణు వార్‌హెడ్‌కు సుమారు 4 కిలోల ప్లుటోనియం అవసరమని పరిగణిస్తే, ఈ నిల్వలతో 140 నుంచి 225 వరకు వార్‌హెడ్‌లను తయారు చేసే అవకాశం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. అయితే మొత్తం ప్లుటోనియం నిల్వను అణ్వాయుధాల తయారీకే వినియోగించకుండా కొంత భాగాన్ని భవిష్యత్ అవసరాల కోసం భారత్ నిల్వ చేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**అణు త్రివిధ ప్రయోగ సామర్థ్యంపై దృష్టి**
భారత్ భూమి, గగనం, సముద్రం నుంచి అణ్వస్త్రాలను ప్రయోగించగల అణు త్రివిధ ప్రయోగ వ్యవస్థను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. చైనా, పాకిస్థాన్ వంటి పొరుగు దేశాల నుంచి ఎదురయ్యే భద్రతా సవాళ్ల నేపథ్యంలో ఈ సామర్థ్యాన్ని భారత్ బలోపేతం చేస్తున్నట్లు విశ్లేషించింది. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది దేశాల వద్ద అణ్వాయుధాలు ఉన్నట్లు పలు అంతర్జాతీయ నివేదికలు పేర్కొంటున్నాయి. రష్యా వద్ద సుమారు 5,500, అమెరికా వద్ద 5,042, చైనా వద్ద 500–600, ఫ్రాన్స్ వద్ద 290, బ్రిటన్ వద్ద 225, పాకిస్థాన్ వద్ద 170, ఇజ్రాయెల్ వద్ద 90, ఉత్తర కొరియా వద్ద సుమారు 60 అణు వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. 1998 పోఖ్రాన్–2 అణు పరీక్షల అనంతరం భారత్ 'ముందుగా అణ్వస్త్రాలను ఉపయోగించం' అనే విధానాన్ని ప్రకటించింది. ప్రత్యర్థి దేశం అణుదాడికి పాల్పడిన సందర్భంలోనే ప్రతిస్పందనగా అణ్వాయుధాలను ఉపయోగిస్తామని భారత్ తన అణు సిద్ధాంతంలో పేర్కొంది.

# బియ్యంతో అన్నం, వంటలే కాదు మీకు తెలియని మరెన్నో సూపర్ ట్రిక్స్!

నార్మల్‌గా బియ్యంతో ఏం చేస్తాం చెప్పండి? అనగానే ఎక్కువ మంది ఠక్కున చెప్పే సమాధానం అన్నం వండుకుంటాం. లేదంటే దోశ, పిండి వంటకాల కోసం ఉపయోగిస్తుంటామని చెబుతారు. ఇవే మనకు తెలిసినవి! కానీ, మీకు తెలుసా? బియ్యంతో అవి మాత్రమే కాకుండా ఇంటి అవసరాల్లో భాగంగా వివిధ రకాలుగా వాడుకోవచ్చంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో ఈ స్టోరీలో తెలుసుకుందాం.



కిచెన్ కప్‌బోర్డులు, రిఫ్రిజిరేటర్ల నుంచి అప్పుడప్పుడూ దుర్వాసనలు వస్తుంటాయి. ఇలాంటప్పుడు రైస్ నింపిన ఒక బౌల్‌ను ఆయా అల్మరాలు, ఫ్రిడ్జ్‌లో ఓ మూలన ఉంచితే ఆ వాసనను బియ్యం పీల్చేసుకుంటాయని చెబుతున్నారు నిపుణులు.

మనం రెగ్యులర్‌గా వంటల్లో వాడే ఉప్పును చాలా మంది డబ్బాలో నిల్వ ఉంచుతారు. అలా స్టోర్ చేసిన ఉప్పు తడి తగిలితే గట్టి పడుతుంది. అయితే, అందులో కొన్ని బియ్యపు గింజలు వేస్తే అలా జరగకుండా ఉంటుందంటున్నారు.

మామిడి, సీతాఫలం వంటి పండ్లను త్వరగా పక్వానికి తీసుకురావడానికి చాలా మంది కొన్ని రకాల రసాయనాలను పెట్టి మాగబెడుతుంటారు. అలాకాకుండా వాటిని బియ్యంలో కప్పి ఉంచితే రసాయనాలు లేకుండా సహజంగానే అవి త్వరగా పండుతాయని నిపుణులు చెబుతున్నారు.

ఇంట్లో పెంచే మొక్కలకు సహజ ఎరువులుగా చాలా మంది అరటి తొక్కలు, కోడిగుడ్ల పెంకులు వినియోగిస్తుంటారు. అయితే, అవే కాకుండా బియ్యాన్ని ఉడికించిన నీటిని (గంజి) మొక్కలకు ఎరువుగానూ వాడచ్చంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే పోషకాలు మొక్కల్ని చీడపీడల నుంచి రక్షిస్తాయని చెబుతున్నారు.

తేమ వల్ల కత్తులు, కత్తెర వంటి కొన్ని ఇనుప వస్తువులు తుప్పు పడుతుంటాయి. అయితే వీటిని బయట కాకుండా ఓ డబ్బాలో బియ్యంలో ఉంచితే ఈ సమస్య ఉండదని చెబుతున్నారు.

వాతావరణంలోని తేమ ప్రభావం వెండి ఆభరణాల మీద ఉంటుంది. తద్వారా అవి కళ తప్పినట్లుగా కనపడతాయి. అలాంటి టైమ్‌లో ఒక మెష్ బ్యాగ్‌లో కొద్దిగా బియ్యం నింపి, వీటిని భద్రపరిచే బాక్సులో ఉంచితే ఆ తేమను బియ్యం పీల్చేసుకుంటుందని చెబుతున్నారు. అలాగే నిర్ణీత వ్యవధుల్లో ఈ బియ్యాన్ని మార్చడం మర్చిపోకూడదని గుర్తుంచుకోవాలి.

మనం అప్పుడప్పుడూ బియ్యపు గింజల్ని పేర్చుతూ వివిధ రకాల అలంకరణ వస్తువులు తయారుచేయడం చూస్తుంటాం. ఓపిక ఉంటే మీరూ ఇలాంటివి రెడీ చేసుకోవచ్చు. ఇక ఈ గింజలకు రంగులు అద్దితే మరింత ఆకర్షణీయమైన డెకరేటివ్ పీసెస్ తయారవుతాయి. వీటికి సంబంధించి యూట్యూబ్‌లో చాలా వీడియోలు చూడచ్చు. లేదంటే మీలోని సృజనకు పదును పెట్టవచ్చంటున్నారు నిపుణులు. బియ్యం కడిగిన నీళ్లు, అన్నాన్ని ఉడికించేటప్పుడు వేరు చేసిన గంజిలోనూ వివిధ పోషకాలు ఉంటాయని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి, ఆ నీటిని ముఖం, జుట్టు, పాదాలు, గోళ్ల సంరక్షణకు వివిధ పద్ధతుల్లో ఉపయోగించవచ్చని సూచిస్తున్నారు. అలాగే అన్నం గంజిలో కాస్త ఉప్పు వేసుకొని తాగితే, అందులోని పోషకాలు శరీరానికి అంది సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చంటున్నారు.



# పదేళ్ల పాలనలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదు

**కార్మిక సంఘాలను అణచివేసే ధోరణి అవలంబించారు..**

**అసెంబ్లీలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, రామగుండం, సెప్టెంబర్ 10:**
గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. కార్మిక సంఘాలను అణచివేసే విధంగా గత ప్రభుత్వం వ్యవహరించిందని అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ తీసుకుంటున్న నిర్ణయాలను ఎమ్మెల్యే స్వాగతించారు. కార్మికుల ప్రయోజనాలకు అనుకూలంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అసెంబ్లీ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. కార్మికులకు అండగా నిలిచే విధానాలను ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్‌తో పాటు పలువురు సహచర ఎమ్మెల్యేలు కలిశారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాలు నాయక్‌కు పరామర్శ

**ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్ యాదవ్**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. కుటుంబ సభ్యులకు ధైర్యం**



**నర్సింహులపేట, సెప్టెంబర్ 10 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
మండలంలోని రూప్లా తండాకు చెందిన బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా నాయకుడు బానోతు కాలు నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్ యాదవ్ గురువారం కాలు నాయక్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. కాలు నాయక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొడుపుగంటి అంజి, మండల ఉపాధ్యక్షుడు మెరుగు యాకయ్య, సత్యనారాయణరెడ్డి, బూత్ అధ్యక్షుడు బానోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.